

ఆదిత్యుని ఆదాయం రూ.5.79 లక్షలు

అరసవల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలోని శ్రీ సూర్యనారాయణ స్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం ఒక్కరోజే ఆదిత్యుడికి రూ.5,79,685 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.2,81,900, విరాళాల రూపంలో రూ.91,410, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2,06,375 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో కేఎన్‌వీ డీవీ ప్రసాద్ తెలిపారు. భక్తుల సౌకర్యానికి ప్రాధాన్యమిస్తూ, ఆలయ అభివృద్ధే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామన్నారు.

కోట శ్రీనివాసరావుకు.. సిక్కోలుతో అనుబంధం

- 35 ఏళ్ల కిందట కమ్మసిగడాం యాత్రకు రాక
- ఆకస్మిక మృతితో అభిమానుల దిగ్భ్రాంతి



కోట శ్రీనివాసరావుతో లోకనాథం (ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): సినీరంగంలో నాలుగున్నర దశాబ్దాల పాటు వెలుగొందిన విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు ఆదివారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందినట్లు తెలిసి జిల్లాలోని ఆయన అభిమానులు దిగ్భ్రాంతి చెందారు. వందల సినిమాల్లో వైవిధ్యమైన పాత్రలతో అలరించిన ఆయన ఇక లేరన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. నాటక, సినిమా రంగాల్లో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న కోట శ్రీనివాసరావుకు ఎంతోమంది అభిమానులు ఉన్నారు. ప్రతినాయకుడిగా, సహాయ నటుడిగా, కమెడియన్‌గా విభిన్నపాత్రల్లో తనదైన శైలిలో ఒదిగిపోయి.. నవ్వుల్లోనూ, కన్నీళ్లల్లోనూ ప్రేక్షకులను ఆకట్టుకున్న గొప్ప నటుడుగా గుర్తింపు పొందారు. 1978లో ప్రాణంఖరీదు సినిమాతో సినీరంగ ప్రవేశం చేశారు. 750 పైగా సినిమాల్లో నటించిన ఆయన ప్రేక్షకుల ను మెప్పిస్తూ 9 నంది అవార్డులు సొంతం చేసుకున్నారు.


● కోట శ్రీనివాసరావు మృతి సినీ, నాటక రంగానికి తీరని లోటని శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి అన్నారు. '35 ఏళ్ల కిందట కోట శ్రీనివాసరావు జిల్లాకు వచ్చారు. రణస్థలం మండలం కమ్మసిగడాం మహాలక్ష్మి జాతరలో నాటక ప్రదర్శనలో పాల్గొన్నారు. పట్టాభి అనే దర్శకుడు, నటుడు నాటక పరిశుద్ధ పేరిట ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆ నాటక పోటీల్లో శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య.. చీకటి అనే నాటికను ప్రదర్శించారు. అదే పరిషత్తు నాటికల్లో కోట శ్రీనివాసరావు ప్రాణం ఖరీదు అనే సాంఘిక నాటికలో విలన్‌గా నటించారు. అప్పుడు రంగస్థల కళాకారుల సమాఖ్య ఆయనను సన్మానించింద'ని రామలింగస్వామి తెలిపారు. కోట శ్రీనివాసరావు సినిమాల్లోకి రాకముందు పరిషత్ నాటకాలు ప్రదర్శించేవారు. ఆయన గుంటూరు, విజయవాడ, పొద్దుటూరుల్లో నాటక పరిషత్ నాటకాలు వేయడానికి వచ్చేవారు. ఆ సమయంలో శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులమంతా కలిసేవాళ్లమ'ని రామలింగస్వామి గుర్తు చేసుకుని విషాదంలో మునిగిపోయారు.

● స్వామి వివేకానంద ట్రస్ట్ అధ్యక్షుడు జి.లోకనాథం(గులోనా) మాట్లాడుతూ 'కోట శ్రీనివాసరావుతో కలిసి పెళ్లి సినిమాలో విలన్‌గా నటించే అవకాశం నాకు దక్కింది. ఆయన విలక్షణ నటుడు. నన్ను చిత్ర పరిశ్రమలో కొనసాగమని కోరేవారు. ఆయనతో కలిసి పనిచేయడం ఓ మధురానుభూతి' అని తెలిపారు. రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పన్నాల నరసింహమూర్తి, చిట్టి వెంకటరావు, రామచంద్రదేవ్, రమణారావు, పొట్నూరు వెంకటరావు తదితరులు కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. సుమిత్రా కళా సమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకర శర్మ, గుత్తు చిన్నారావు, సురేష్ నివాళులర్పించారు.



కోట శ్రీనివాసరావు (ఫైల్)

ఏపీ ఫైబర్.. నో సిగ్నల్



- జిల్లాలో సక్రమంగా అందని సేవలు
- సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు
- వినియోగదారుల్లో అసంతృప్తి
- విముఖత చూపుతున్న ఆపరేటర్లు


● సాంకేతిక సమస్యలతో ఏపీ ఫైబర్ నెట్ సేవలకు అంతరాయం కలుగుతోంది. యూపీఎస్‌లు పనిచేయడం లేదు. డిజిటల్ బాక్సులు ఇవ్వడం లేదు. సేవలు సక్రమంగా లేక వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌లకు మారిపోతున్నారు. దీంతో మేము నష్టపోతున్నాం. నాలుగు నెలలుగా మాకు కమీషన్లు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఇలా అయితే ఏపీ ఫైబర్ నెట్ సేవల నుంచి తప్పుకోవడమే ఉత్తమం.

- శ్రీకాకుళం పరిసర ప్రాంతానికి చెందిన ఏపీ ఫైబర్‌నెట్ ఆపరేటర్ బాలకృష్ణ ఆవేదన ఇది

● సచివాలయాలకు ఇంటర్నెట్ సేవలు సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నాం. ఏపీ ఫైబర్‌నెట్ ఎప్పుడు పనిచేస్తుందో.. ఎప్పుడు పనిచేయదో అర్థం కావడం లేదు. ఒక్కోసారి హైస్పీడ్‌తో ఇంటర్నెట్ వస్తోంది. మరోసారి నో సిగ్నల్ కనిపిస్తోంది. దీంతో సెల్‌ఫోన్లకు వైఫై ఆన్‌చేసి కంప్యూటర్లను వాడుకోవాల్సిన దుర్భర పరిస్థితి ఎదురవుతోంది.

-గ్రామ, వార్డు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల ఆవేదన ఇది





జేఆర్.పురంలో ఏపీ ఫైబర్ నెట్ సిగ్నల్ పరిస్థితి ఇదీ

రణస్థలం, జూలై 13(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఏపీ ఫైబర్‌నెట్ సేవలు దారుణంగా తయారయ్యాయి. సాంకేతిక సమస్యలు కారణంగా వినియోగదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో చాలామంది ఇతర నెట్‌వర్క్‌లకు మారేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ఫైబర్‌నెట్ డిపాజిట్లు కట్టి కమీషన్ ప్రాతిపదికగా పనిచేస్తున్న ఆపరేటర్లు సైతం ఇక మేము విధుల నుంచి తప్పుకుంటామని చేతులెత్తేస్తున్నారు. ఇంటింటికీ నాణ్యమైన ఇంటర్‌నెట్ సేవలు అందించేందుకు 2017లో టీడీపీ ప్రభుత్వం ఏపీ ఫైబర్ నెట్ సేవలను ప్రారంభించింది. ఇంటర్నెట్, కేబుల్, ల్యాండ్ ఫోన్.. ఇలా మూడు రకాల సేవలను అతి తక్కువ ధరకు ప్రజలకు అందించడమే ధ్యేయంగా ఏపీ ఫైబర్‌నెట్ లిమిటెడ్‌ను అందుబాటులోకి తెచ్చింది. విడివిడిగా లభించే ఈ మూడు రకాల సర్వీస్ ప్రొవైడర్లను ఫైబర్ నెట్ ద్వారా అందించి కుటుంబాలకు సాంత్వన చేకూర్చాలని అప్పటి సీఎం చంద్రబాబు భావించారు. ఉమ్మడి జిల్లాలో 40వేలకుపైగా ఫైబర్ నెట్ కనెక్షన్లు ఏర్పాటు చేశారు. రూ.149కే బేసిక్‌ప్లాన్ అందుబాటులోకి తేవడంతో చాలామంది ఏపీ ఫైబర్‌నెట్ సేవలు పొందేందుకు ఆసక్తి చూపారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏపీ ఫైబర్ నిర్వీర్యమైంది. వైసీపీ ప్రభుత్వం బేసిక్ ప్లాన్‌ను రూ.149 నుంచి ఏకంగా రూ.350కు పెంచింది. పైగా టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందనే కారణంతో.. ఫైబర్ నెట్ నిర్వహణను గాలికి వదిలేయడంతో సేవలకు అంతరాయం కలిగింది. ఆపై వినియోగదారుల సంఖ్య తగ్గింది. జిల్లాలో 2024 నాటికి వచ్చేసరికి 19వేలకు పడిపోయింది. సేవలు సక్రమంగా వినియోగదారుల్లో ఫైబర్‌నెట్‌పై అసంతృప్తి కనిపిస్తోంది. జిల్లాలో సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి మరో 2వేల వరకూ సర్వీసులు ఉన్నాయి. వాటికి నిరంతరాయంగా సేవలు అందించ డంలో ఏపీ ఫైబర్‌నెట్ విఫలమవుతోంది. దీంతో ఫైబర్ నెట్ సేవలు తగ్గుముఖం పడుతున్నాయి. జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థల కనెక్షన్లు పెరుగుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే **(మిగతా 8వ పేజీలో..)**



రేషన్ మాఫియాకు చెక్ పడేనా?

- జిల్లాలో యథేచ్ఛగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా
- మిల్లుల్లో పాలిష్ చేసి.. అధిక ధరకు విక్రయాలు
- అక్రమాల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

నరసన్నపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారి పడుతూనే ఉన్నాయి. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి.. సన్నబియ్యం పేరిట వాటిని విక్రయిస్తూ రూ.కోట్లు సంపాదిస్తున్నారు. అడపాదడపా అధికారుల తనిఖీల్లో రేషన్ బియ్యం పట్టుబడుతున్నా, జరిమానా విధిలించి వదిలేయడం తప్ప.. కఠినచర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇదే అలుసుగా అక్రమార్కులు బియ్యాన్ని బొక్కేస్తున్నారు. తాజాగా పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో భాగంగా శ్రీకాకుళం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు శనివారం భారీగా రేషన్ బియ్యం పట్టుబడిన విషయం తెలిసిందే. కొత్తూరు మండలం కడుమలో రైస్‌మిల్లు నుంచి ఒడిశా రాష్ట్రం నవరంగపూర్‌కు లారీల్లో తరలిస్తున్న 34,800 కిలోల (700 బస్తాలు) పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశారు. సుమారు రూ. 15.83 లక్షల బియ్యం పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనతోనైె రేషన్ మాఫియా ఆగడాలకు చెక్ పడుతుందా? లేదోనన్న చర్చ సాగుతోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 6,60,739 రేషన్‌కార్డులు ఉన్నాయి. 1,603 డిపోల ద్వారా ప్రతీ నెలా ఒక్కో **(మిగతా 7వ పేజీలో..)**



కడుమ రైసుమిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

బండెక్కిన అభిమానం!
● ఇష్టారాజ్యంగా ద్విచక్ర వాహనాలకు నెంబరు ప్లేట్లు — 8లో

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు **దరఖాస్తుల ఆహ్వానం**

వీఆర్‌కు ఇద్దరు ఎస్‌ఐలు?
● విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలే కారణం — 7లో

అభివృద్ధి లేదు.. మరమ్మతులు చేయరూ!
● శివసాగర్ బీచ్‌లో పాడైపోయిన విశ్రాంతి షెడ్లు ● పర్యాటకులకు అవస్థలు — 8లో



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

నారాయణవలసలో రూ.1.50 కోట్లు అవినీతి — 8లో
● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

నెత్తుటి ఘటనకు **పదిహేనేళ్లు**
● 'థర్మల్'కు వ్యతిరేకంగా రైతుల ఉద్యమం
● అమరుల త్యాగాలను స్మరించుకుంటూ నేడు సభ — 7లో



అమరవీరుల స్థూపం

విద్యార్థులకు తీపికబురు



● మెళియాపుట్టి మండలం అడ్డివాడ గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతీరోజు సుమారు 5కిలోమీటర్లు దూరంలో ఉన్న టెక్కలి మండలం నర్సింగపల్లి పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. చాలామంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా నడుచుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

● టెక్కలి మండలం సన్యాసినీలాపురం, గూడేం గ్రామాల నుంచి ప్రతీరోజు సుమారు 15మంది విద్యార్థులు నర్సింగపల్లి జిల్లాపరిషత్ పాఠశాలకు ఆటోల్లో వస్తున్నారు. రవాణా చార్జీల భారంతో తల్లిదండ్రులు కాస్త ఇబ్బందులు పడుతున్నారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రవాణా చార్జీలు
- కిలోమీటరు దాటి వస్తున్న వారికి ప్రతీనెలా రూ.600
- ప్రతీ మూడునెలలకోసారి తల్లుల ఖాతాల్లో జమ
- తల్లిదండ్రుల్లో హర్షం

● మెళియాపుట్టి మండలం టీకేఆర్ పు రం, జాడుపల్లి, జోడూరు గ్రామాలకు చెందిన విద్యార్థులు సుమారు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న చాపర జిల్లాపరి షత్ పాఠశాలలో చదువుతున్నారు. ఈ విద్యార్థులు కూడా రోజూ ఆటోల్లో రాకపోకలు సాగిస్తున్నారు.



టెక్కలి రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి):

..ఇటువంటి విద్యార్థులందరికీ ఊరట కలిగించేలా ఇకపై ప్రభుత్వమే రవాణా చార్జీలు చెల్లించనుంది. కిలోమీటరు దాటి పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో మూడునెలలకోసారి రవాణాచార్జీల నిధులు రూ.1,800 చొప్పున జమ చేయనుంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలో 2,955 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఒకటి నుంచి పదోతరగతి వరకు సుమారు 1,60,038 మంది విద్యార్థులు చదువుతున్నారు. కిలోమీటరు దాటి పాఠశాలలకు వస్తున్న విద్యార్థులు సుమారు 3వేల మంది ఉంటారని అధికారుల అంచనా. వీరికి రవాణా చార్జీల కింద నెలకు రూ.600 చొప్పున ప్రభుత్వం అందజేయనుంది. ప్రతీ మూడు నెలలకోసారి రూ.1,800 చొప్పున విద్యార్థుల తల్లులు బ్యాంకు ఖాతాలో నిధులు జమ చేయనుంది. అలాగే భవిత కేంద్రాల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు సైతం ప్రభుత్వం చెల్లించే రవాణా చార్జీలను పెంచే యోచనలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉన్నట్టు తెలుస్తోంది. భవిత కేంద్రాల్లో ఒక్కో విద్యార్థికి ప్రస్తుతం నెలకు రూ.300 చొప్పున అందజేస్తున్నారు. ఈ డబ్బులు చాలడం లేదని, చాలా మంది **(మిగతా 7వ పేజీలో..)**

ఆదేశాలు వచ్చాయి..

విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో ప్రతీ మూడు నెలలకు కచ్చితంగా రవాణా ఖర్చులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేశ్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

-ఎస్.దేవేంద్రరావు, ఎంఈవో, మెళియాపుట్టి



విద్యుత్ కోతతో రోగుల అవస్థలు

టెక్కలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రిలో ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆసుపత్రిలోని బాలింతలు, చిన్నారులు, రోగులు ఉక్కపోత, దోమల బెడదతో అవస్థలు పడ్డారు. రోగికి సహాయకులుగా వచ్చినవారు విసనకర్రలతో విసురుకునే పరిస్థితి నెలకొంది. విద్యుత్ కోతపై ఆస్పత్రి సిబ్బందిని రోగుల బంధువులు ప్రశ్నించడంతో అరగంట తర్వాత జనరేటర్ ఆన్ చేశారు.

న్యూస్ బాక్స్

రాష్ట్రస్థాయి పోటీలకు చిన్నారులు



కవిటి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి షటిల్ పోటీలకు కవిటికి చెందిన చిన్నారులు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లాస్థాయిలో అండర్-11 విభాగంలో బెందాళం సమన్విత, రేణుక పాల్గొని ప్రతిభ కనబరిచారు. కడపలో జరగనున్న పోటీల్లో వీరు పాల్గోనున్నారు. ఈ సందర్భంగా చిన్నారులను ఉషోదయ యువజన సంఘం, గ్రామస్థులు, షటిల్ క్రీడాకారులు అభినందించారు.

వీఆర్‌కు ఇద్దరు ఎస్‌ఐలు?

శ్రీకాకుళం, జూలై 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్ల (ఎస్‌ఐ)ను వీఆర్ (వేకెంట్ రిజర్వ్)కు పంపారు. ఈ మేరకు ఎస్పీ మహేశ్వరరెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. జి.సిగడాం మండలంలో ఇటీవల విగ్రహాల ధ్వంసం ఘటన.. విధుల్లో నిర్లక్ష్యం వహించిన జి.సిగడాం ఎస్‌ఐను, అలాగే అవినీతికి పాల్పడుతూ రెండు పర్యాయాలు హెచ్చరించినా ఫలితం లేకపోవడంతో ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐని వీఆర్‌కు పంపినట్లు తెలిసింది. ఒకరు విధుల్లో నిర్లక్ష్యం, మరొకరు అవినీతి ఆరోపణలు ఎక్కువ గా ఉండటంతో తక్షణమే ఎస్పీ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

రాబోయేది వైసీపీనే

లావేరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): అంతా కలిసి కట్టుగా పని చేస్తే రాబోయేది వైసీపీ పాలనేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం బెజ్జిపురంలో వైసీపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, పలువురు నేతలు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కోట' మృతికి సంతాపం

ఆమదాలవలస, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విలక్షణ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి తెలుగు చలనచిత్ర రంగానికి తీరని లోటని శ్రీవెంకటేశ్వర కళా మండలి అధ్యక్షుడు కేవీ రాజారావు అన్నారు. సంతాప సభను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి కుప్పిలి శ్యామలరావు, కుప్పిలి రామారావు, లోలుగు విశ్వేశ్వరరావు, రవికుమార్, పలువురు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి వద్ద ఓ ప్రైవేటు లాడ్జిలో పేకాట ఆడుతున్న నలుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,420 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక సోమవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అర్జీదారులు వారి దరఖాస్తులను మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నెత్తుటి ఘటనకు పదిహేనేళ్లు

- 'థర్మల్'కు వ్యతిరేకంగా భారీ ఉద్యమం
- పర్యావరణ పరిరక్షణకు రైతుల ఆరాటం
- అమరుల త్యాగాలను స్మరించుకుంటూ నేడు సభ



బీలలో ఉద్యమకారులపై పోలీసుల లాఠీచార్జి (ఫైల్)

సోంపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మానవ జీవనానికి, సహజ సమతుల్యతకు దోహద పడే ప్రకృతి వనరులను నాశనం చేసేలా నాటి ప్రభుత్వాలు, పాలకులు తీసుకున్న నిర్ణయానికి ప్రజలు, రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ నేపథ్యంలో సాగిన పోరాటంలో పోలీసుల తుపాకి గుళ్లకు ముగ్గురు రైతులు అశువులుబాసారు. దీంతో ఉద్యమం ఉవ్వెత్తున లేచి దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించింది. భవిష్యత్ తరాల బాగు కోసం ఉద్యమబాట పట్టి, పోలీసుల తూటాలకు ఎదురొడ్డి తమ ప్రాణాలు అర్పించి అమరులైన రైతుల త్యాగాలకు, ప్రజలందరినీ ఏకం చేసి, థర్మల్ ఉద్యమాన్ని ఉధృతరూపం చేసేలా చేసిన థర్మల్ పోరాటానికి సోమవారంతో 15 ఏళ్లు పూర్తికానున్నాయి. నాటి ఘటనలపై ప్రత్యేక కథనం.

నెత్తుటి గాయాలకు సాక్ష్యాలివే..

బారువ బీల ప్రాంతంలో థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభించేందుకు శంకుస్థాపన చేస్తున్నారన్న సమాచారంతో 2010 జూలై 14న ఈ ప్రాంత రైతులు, మత్స్యకారులు తమ భూముల కోసం, సహజ వనరుల సంరక్షణ కోసం ఆందోళనకు దిగారు. నిరసన తెలిపేందుకు బీల ప్రాంతానికి వేదికగా చేసు కుని తరలి వచ్చారు. ఈ ప్రాంతంలో ప్లాంట్ ఏర్పాటు చేస్తే తమ బతుకులు బుగ్గిపాలౌతాయని ఆవేదన చెందారు.. అయితే అంతకు ముందు జరిగిన ఘటనలు, ఎలాగైనా ప్రజలను తరిమికొట్టాలన్న పోలీసులు, ఎన్‌సీసీ యాజమాన్యం పట్టుదల ఉద్రిక్తలకు దారితీసింది. ఎన్‌సీసీ ఏర్పాటు చేసిన గుండాలు, ఉద్యమ నాయకులపై కర్రలతో దాడి చేయడంతో ఆగ్రహోద్యులైన ప్రజలు వారిని తరిమికొట్టారు. ఈ క్రమంలో పోలీసులు అమాయకులైన మత్స్యకారులు, రైతులపై కాల్పులు చేశారు. ఈ కాల్పుల్లో ముగ్గురు రైతులు తమ ప్రాణాలను కోల్పోయారు. పలాసపురానికి చెందిన గున్న జోగారావు, బెందాళం కృష్ణమూర్తి, లక్కవరానికి చెందిన గొనప కృష్ణమూర్తి బుల్లెట్ గాయాలతో మృతిచెందారు. ఈ నెత్తుటి ఘటన అనంతరం థర్మల్ ఉద్యమం మరింత ఉధృతమైంది. దేశ వ్యాప్తంగా సోంపేట ఉద్యమానికి ప్రజలు మద్దతు పలికారు. దీంతో అన్ని రాజకీయ పార్టీల నేతలు వచ్చి ప్రజలను పరామర్శించి జీవో రద్దు అందోళనలు కొనసాగించారు. ఆ తరువాత ఏర్పడిన చంద్రబాబునాయుడు ప్రభుత్వం 1107 జీవోను రద్దు చేస్తూ మంత్రిమండలిలో నిర్ణయం తీసుకుని జీవో ఇచ్చారు. అదేవిధంగా బీలలో థర్మల్‌ప్లాంట్ నిర్మాణం జరగదని ఇక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. అయితే 1107 జీవోను రద్దు చేసి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం 329 జీవో విడుదల చేశారు.

చిత్తడి నేలలు సంరక్షించండి..

బెంకిలి పంచాయతీ పరిధిలోని 198 ఎకరాలు, రుషికుడ్డ 797 ఎకరాలు, బారువ పేట 227 ఎకరాలు, గొల్లగండి పంచాయతీ పరిధిలోని 249 ఎకరాల పరిధిలో ఉన్న చిత్తడి నేలలను రక్షించాలని కోరుతూ ప్రభుత్వానికి తీర్మానాలు చేసి పంపించారు. పర్యావరణ వేత్తల కదలికతో సలీం ఆలీ సెంటర్‌ఫర్ ఆర్నిథాలజీ నేచురల్ హిస్టరీ(సాకాన్) సభ్యులు 2012లో బీల ప్రాంతాన్ని సందర్శించి ఈ ప్రాంతంలో విలువైన చిత్తడి నేలలున్నట్లు గుర్తించారు. సాకాన్ నివేదిక ప్రకారం పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసు వేసి పోరాటం చేశారు. చిత్తడి నేలలు సంరక్షించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం తీసుకురావాలని కోర్టు ద్వారా తీర్పు వెలువడింది. ఈ ప్రాంతాన్ని కమ్యూనిటీ రిజర్వ్‌గా గుర్తించి మూడు నెలలకు ఒకసారి వివరాలు తెలియజేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రభుత్వాలు కాలయాపన చేయడం తప్ప ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోలేదని కోర్టు ధిక్కరణ కింద ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ, పర్యావరణ పరిరక్షణ సంఘం నాయకులు డా.యారాడి కృష్ణమూర్తి తదితరులు ఆధ్వర్యంలో ఉద్యమకారులు కోరారు.

నేడు సంస్మరణ సభ..

థర్మల్ పోరాటంలో అశువులు బాసిన రైతులను స్మరించుకుంటూ నాటి పోరాటాన్ని మననం చేసుకుంటూ సోమవారం పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో స్థూపం వద్ద సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చంద్రన్నతోనే సుపరిపాలన: ఎమ్మెల్యే రవికుమార్



ఆమదాలవలస: పీర్‌సాహెబ్‌పేటలో ప్రచారం చేస్తున్న పాల్గొన్న రవికుమార్

ఆమదాలవలస, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆదివారం కలివరం గ్రామ పంచాయతీ పీర్‌సాహెబ్‌పేట గ్రామంలో 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం ప్రతి పథకం ద్వారా లబ్ధిచేకూర్చడం జరుగుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి పథకాలను వివరించారు. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు మెట్ట సుజాత, పార్టీ మండల అధ్యక్షుడు నూకరాజు, నారాయణపురం ఆనకట్ట చైర్మన్ సనపల డిల్లీశ్వరరావు, నాయకులు తమ్మినేని నాని, అన్నెపు భాస్కర రావు, గొండు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



గార: కరపత్రం అందించి వివరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే శంకర్

గార, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం రామచంద్రాపురం, సతివాడ గ్రామాల్లో 'సుపరి పాలనకు తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఎన్నికల ముందు హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

జ్ఞానాన్ని అందించేది గురువు: ఎన్‌ఈఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్

రణస్థలం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞాన జ్యోతిని వెలిగించేది గురువు అని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ రణస్థలం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంప్రదాయంలో గురువు స్థానం అత్యున్నతమైందన్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుడు శేషగిరి పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

గార, జూలై 13(ఆంధ్రజ్యోతి): కె.మత్స్యలేశం బీచ్‌లోని మత్స్య నారాయణస్వామి ఆలయంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ విభాగ కార్యవాహ డీవీ రమణమూర్తి గురుపూజోత్సవ విశిష్టతను వివరించారు. కార్యక్రమం లో గంగాడ రామారావు, బుద్దా ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

చౌదరి సత్యనారాయణకు నివాళి



చౌదరి సత్యనారాయణ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే, జననాయక్ చౌదరి సత్యనారాయణ 117వ జయంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. శ్రీకాకుళం సింహద్వారం వద్ద సత్యనారాయణ విగ్రహానికి ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, గ్రామస్థులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రజాసేవకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణ మూర్తి, డీసీఎంఎస్ అధ్యక్షుడు అవినాశ్, జడ్పీ మాజీ చైర్మన్ ధనలక్ష్మి, ఎన్‌జీవో సంఘం మాజీ ప్రధానకార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేర్ని నానిపై చర్యలు తీసుకోండి

కవిటి/ఇచ్ఛాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): అనుచిత వ్యాఖ్యలు చేసి రెచ్చగొట్టేలా మాట్లాడిన మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానిపై చర్యలు తీసుకోవాలని కవిటి, ఇచ్ఛాపురంలలో టీడీపీ నేతలు ఆదివారం నిరసన చేపట్టారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదులు చేశారు. పేర్ని నాని వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని, తక్షణం ఆయనను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఇచ్ఛాపురం పట్టణ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు పత్రి తవిటయ్య, నందిగాం కోటి, కొండా శంకర్‌రెడ్డి, బత్తిన కృష్ణయ్య, కాళ్ల జయదేవ్, ఆశి లీలారాణి, కవిటి ఏఎంసీ చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, రైల్వే బోర్డు సభ్యుడు శ్రీనివాస్‌రౌళో, బి.రమేష్, బి.తిరుమలరావు, ఎస్‌వి రమణ, సంతోష్ పట్నాయక్, వి.రంగారావు, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





కవిటి, ఇచ్ఛాపురంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

విద్యార్థులకు తీపికబురు

(ఐదో పేజీ తరువాయి)

తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి సైతం రవాణా చార్జీల నిధులు రెట్టింపు చేయనున్నట్టు సమాచారం. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తల్లికి వందనం కింద ఏడాదికి రూ.13వేలు చొప్పున నిధులు జమ చేసిన ప్రభుత్వం.. తాజాగా రవాణా చార్జీలు కూడా చెల్లించనుండడంతో తమకు ఎంతో ఊరట కలుగుతోందని పేర్కొంటున్నారు.

రేషన్ మాఫియాకు చెక్ పడేనా?

(ఐదో పేజీ తరువాయి)

కార్డుదారుడికి 5 కిలోల చొప్పున బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. చాలా మంది రేషన్ కార్డుదారులు ఈ బియ్యాన్ని వినియోగించకుండా స్థానిక వ్యాపారులకు కిలో రూ.17 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నారు. ఆయా వ్యాపారులు పెద్ద మొత్తంలో ఒకేసారి ఆ బియ్యాన్ని మిల్లుకు తరలిస్తున్నారు. నరసన్నపేటలోని జగన్నాథపురం, బొరిగివలసలో వ్యాపారులు అధికంగా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. నరసన్నపేట, బొరిగివలస, మడపాం తదితర ప్రాంతాల్లో మిల్లులకు ఇతర ప్రాంతాల నుంచి బియ్యం దిగుమతి అవుతున్నాయి. వాటిని పాలిష్ చేసి.. మెరుపు వచ్చేందుకు నూనె వేస్తూ మిల్లింగ్ చేస్తారు. సన్న బియ్యం మాదిరి వాటిని ప్యాకింగ్ చేసి కిలో 60 నుంచి రూ.65 చొప్పున విక్రయిస్తున్నారు. జిల్లాలో చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. కొంతమంది అధికారులకు మామూళ్లు ముట్ట చెప్పడంతో బియ్యం అక్రమ రవాణా చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఒకవేళ పట్టుకున్నా 6ఏ కేసులు నమోదు చేసి.. జరిమానా విధించి వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాగా, రేషన్ బియ్యం అక్రమ రవాణా నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఎక్కడికక్కడ నిఘా పెంచాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహన్ ఇటీవల అధికారులకు ఆదేశించారు. రేషన్ బియ్యం పట్టుబడితే 6ఏతో పాటు పీడీయాక్ట్, బీఎన్‌ఎస్ చట్టాల కింద కూడా కేసులు నమోదు చేసి అక్రమార్కుల ఆట కట్టించాలని స్పష్టం చేశారు. దీనిపై అధికారులు ఏ విధంగా వ్యవహరిస్తారో వేచిచూడాలి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



లావేరు జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

లావేరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1973-1980 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వ హించారు. పాఠశాల ఆవరణలో వారంతా కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కుటుంబాలతో హాజరై యోగక్షేమాలను ఒకరికొకరు చెప్పుకుని ఆనందం పొందారు. అప్పటి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డి సూర్యనారాయణ, ఎం.నీలాద్రిరావు, ఉపాధ్యాయులు గుడ్ల త్రినాథస్వామి, ఎం.గున్నయ్య, వీరాస్వామి, ప్రస్తుత హెచ్‌ఎం పి.జగన్నాథరావులను సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జేసీ రెడ్డి గున్నయ్య, యడ్ల పాపినాయుడు, మొంగం వెంకటరమణ కోరాడ వెంకటరమణ, మాకన మల్లేశ్వరరావు, ఐ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకూర్మనాథుని సేవలో..



ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేష్‌కు ప్రసాదం అందిస్తున్న అధికారులు

గార జూలై 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం లోని శ్రీకూర్మనాథ స్వామిని తమిళనాడు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ టీఎస్ వెంకటేష్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేసి ఆలయ చరిత్ర, విశిష్టతను వివరించారు. స్వామి వారి ప్రసాదం, చిత్రపటాన్ని ఆలయ అధికారులు అందజేశారు. తహసీల్దార్ ఎం.చక్రవర్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు. అలాగే అరకు ఎంపీ తనూజారాణి, పాలకొండ మాజీ ఎమ్మెల్యే కళావతి శ్రీకూర్మనాథుని దర్శించుకున్నారు.

పొందూరు పీఏసీఎస్ కార్యవర్గ ప్రమాణం

పొందూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పొందూరు పీఏసీఎస్‌కు నియమితులైన త్రిసభ్య కమిటీ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా వండాన మురళి, సభ్యులుగా దుంపల సత్యం, కింజరాపు వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులతో సీఈవో వై.పాపినాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ.. రైతులకు అన్ని విధాలా సేవలందిస్తానన్నారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కె.సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్ వారిని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.లక్ష్మి, నాయకులు అన్నెపు రాము, సీపాన శ్రీరంగనాయకులు, చింతాడ వాసు, బలగ శంకరభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు 'తల్లికి వందనం' విరాళం

- రూ.15 వేలు అందజేత
- ఆదర్శంగా నిలిచిన శోభాదేవి
- అభినందించిన గ్రామస్థులు





ఇద్దరు కుమారులతో తల్లి శోభాదేవి

గార, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చదువును ప్రోత్సహించేందుకుగాను 'తల్లికి వందనం' నగదును తల్లుల ఖాతాల్లో వేసింది. దీంతో విద్యార్థులను పాఠశాలలకు పంపడం ద్వారా వారిని ఉన్నతులుగా తీర్చి దిద్దడం లక్ష్యం.. వైసీపీ హయాంలో 'అమ్మఒడి' పేరిట ఇంటిలో ఎంతమంది పిల్లలున్నా ఇస్తామని వైసీపీ ప్రభుత్వం ముందు ప్రకటించి ఈ తరువాత ఇంటిలో ఒక విద్యార్థికే అందించి చేతులెత్తేసింది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం ఇంటిలో ఎంత మంది విద్యార్థులున్నా 'తల్లికి వందనం' ఇస్తామని ప్రకటించి పారదర్శకంగా అమలు చేసి తన చిత్తశుద్ధిని ప్రదర్శించింది. దీంతో తల్లుల ముఖాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే ఈ పథకం తన కుమారుడికి వర్తించడంతో ఆ తల్లి ఆనందానికి అవధుల్లేవు. ఒక కుమారుడికి వచ్చిన రూ.13 వేలకు మరో రెండు వేలు కలిపి పాఠశాలకు విరాళంగా ఇచ్చి గార మండలం కె.మత్స్యలేశం గ్రామానికి చెందిన కొండి శోభాదేవి ఆదర్శంగా నిలిచారు. ఆమెను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ప్రభుత్వం అన్నీ సమకూరుస్తున్నందునే..

మా పిల్లలు ఇద్దరు కె.మత్స్యలేశం మండల ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్నారు. పెద్ద బాబు నయాత్విక్ (6) రెండో తరగతి, చిన్నబాబు తశ్రిత్ (3) ఎల్‌కేజీ చదువుతున్నాడు. తల్లికి వందనం మొత్తం పెద్దబాబు పేరిట ఇటీవల ప్రభుత్వం రూ.13 వేలు నా ఖాతాలో జమ చేసింది. ప్రభుత్వమే పాఠశాలల్లో విద్యార్థులకు అన్నీ సమకూరుస్తోంది. యూనిఫారాలు, పుస్తకాలు, నోట్సులు, బ్యాగ్, షూలతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పెడుతోంది. అలాంటప్పుడు మాకు ఇంకా డబ్బులు అవసరం ఏముంది. రెండో పూట పిల్లలను చూసుకునే బాధ్యత నాదే కదా. పిల్లలకు ఉపాధ్యాయులు బాగా చదువు చెబితే మాకు అదేచాలు. అందుకే రూ.13 వేలకు మరో రూ.2 వేలు కలిపి పాఠశాల అభివృద్ధికి ఇచ్చా. ఎంతో ఆనందంగా ఉంది.

-శోభాదేవి, విద్యార్థుల తల్లి, కె.మత్స్యలేశం

పట్టుదల ఉంటే క్రీడల్లో రాణించవచ్చు

- ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



జిల్లాస్థాయి విజేతలతో నిర్వాహకులు, అతిథులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 13(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, పట్టుదల ఉంటే క్రీడల్లో రాణించవచ్చని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ గూడేన సోమేశ్వరరావు అన్నారు. స్థానిక శాంతినగర్ కాలనీ ఇండోర్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా బ్యాడ్మిం టన్ చాంపియన్‌షిప్ ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు రాణిస్తున్నారంటే వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతైనా ఉందన్నారు. గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం జిల్లాస్థాయి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బైరి దామోదర్, ఎంఎంవిలేఖర్, గురుగుబెల్లి రాజు, ఎం.వేణు, సీఈవో సంపతిరావు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు తక్షణం జీతాలు చెల్లించాలి

పొందూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీలు జరిగిన ఉపాధ్యాయులకు తక్షణం జీతాలు చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న కోరారు. ఈ మేరకు ఆదివారం సంస్థ కార్యాలయంలో ఆయన విలే కరులతో మాట్లాడుతూ.. పాఠశాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొన్ని పాఠశాలలకు కొత్తగా హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, క్లస్టర్ ఉపా ధ్యాయులను సృష్టించి ఈ పోస్టుల్లో భర్తీ చేశారన్నారు. అయితే ఈ పోస్టుల్లో నియమించిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీ కేటాయించక పోవడంతో ఇంతవరకు జీతాలు అందలేదన్నారు. దీంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి గురుగుబెల్లి రాజశేఖర్ ఉన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


జగదీశ్వరరావు (ఫైల్)

ఎల్ఎన్ పేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): శ్యామలాపురం గ్రామానికి చెందిన ఇప్పిలి జగదీశ్వరరావు(50) ఆదివారం పాముకాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం జగదీశ్వరరావు తన కోళ్లఫారంలోని కోడి తీస్తున్న సమయంలో కోడి కాళ్లగోళ్లు తగిలినట్లుగా అనిపించడంతో పట్టించుకోలేదు. పశువుల కోసం పక్కనే ఉన్న గడ్డికుప్పకు వెళ్లి గడ్డి తీసుకొని ఇంటికివచ్చేసరికి నోటి నుంచి సొంగలు వచ్చాయి. దీంతో వెంటనే ఆసుపత్రికి వెళ్లే క్రమంలో సరుబుజ్జిలి వచ్చేసరికి చనిపోయాడు. జగదీశ్వరరావుకి భార్య భానుమతి ఉంది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఎల్ఎన్ పేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోవిలాం పంచాయతీ పరిధి బోరమాంబపురం (ఉప్పరపేట) గ్రామానికి చెందిన చెన్నబోయిన మౌనిక(18) అదృశ్యమైనట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సరుబుజ్జిలి ఎస్ఐ బి.హైమావతి తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి గ్రామం లోని కిరాణా షాప్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన మౌనిక తిరిగి రాలేదని ఆమె తండ్రి తిరుపతిరావు ఆదివారం సరుబుజ్జిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మంత్రి ఆదేశంతో పూడ్చిన గోతులు


గోతులు పూడ్చుతున్న దృశ్యం

సంతబొమ్మాళి, జూలై 13(ఆంధ్రజ్యోతి): మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలతో సంతబొమ్మాళి నుంచి పాలేశ్వరస్వామి ఆలయం వరకు గోతులను అధికారులు ఆదివారం పూడ్చారు. శనివారం దండుగోపాలపురంలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి వెళ్లిన మంత్రి అచ్చెన్నాయుడు రోడ్డు పరిస్థితిని గుర్తించి పూడ్చాలని ఆర్అండ్‌బీ అధికారులు ఆదేశించారు. యుద్ధప్రాతిపదిక గోతులు పూడ్చారు.

సందడిగా ఆవేటివారాలు


ప్రసాదాలు సమర్పిస్తున్న భక్తులు

వజ్రపుకొత్తూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): చినవంకలో ఆదివారం ఆవేటి వారాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పొలంలో విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో గ్రామంలో ఉన్న అమ్మవార్లకు చల్లదనం చేసే కార్యక్రమంలో భాగంగా ఆవేటి వారాలు ఏటా నిర్వహిస్తారు. ఉదయం ఉజ్జుడమ్మ వారికి, సాయంత్రం పెదమ్మతల్లి, వంకపోలమ్మ, మరిడమ్మ, కొత్తమ్మ , అమ్మ వార్లకు మేళతాళలతో వెళ్లి ప్రసాదాలు సమర్పించారు.

పాతపట్నం పీఏసీఎస్ అధ్యక్షుడిగా రవివర్మ


బండి రవివర్మ

పాతపట్నం, జూలై 13(ఆంధ్రజ్యోతి): పాతపట్నం పీఏసీఎస్ అధ్యక్షుడిగా బండి రవివర్మ నియమితుల య్యారు. దీర్ఘకాలంటా టీడీపీ పటిష్టతకు కృషి చేసినందుకు తగిన గుర్తింపు లభించింది. సీది గ్రామానికి చెందిన రవివర్మ కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడికి వరుసకు మేనమామ అవుతారు. ఈయన గతంలో గుమ్మగెడ్డ నీటిసంఘ అధ్యక్షుడిగా, బైదలాపురం పీహెచ్ సీ చైర్మన్‌గా సేవలందించారు. అలాగే డైరెక్టర్లుగా పెద్ద సీది గ్రామానికి చెందిన కాళ్ల కృష్ణారావు, గంగువాడ గ్రామానికి చెందిన సిరి పురం గంగాధరరావు నియమితులయ్యారు. కాగా వీరు గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాల బోగట్టా. వీరి నియామకంపై పార్టీ నాయ కులు పైల బాబ్జీ, మద్దు రామారావు, శివ్వాల చిన్నయ్య, సైలాడ సతీష్, శ్రీరాం దుర్గాప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ ఫైబర్.. నో సిగ్నల్

(ఐదో పేజీ తరువాయి)

మరిన్ని కనెక్షన్లకు దిగజారడం ఖాయమని ఆపరేటర్లు తేల్చిచెబుతున్నారు.

కేవలం పట్టణాలు.. పరిసరాల్లోనే..

విద్యుత్ శాఖతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా హైస్పీడ్ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,449 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ స్తంభాలను ఉపయోగించుకొని 24 వేల కిలోమీటర్ల మేర కేబుల్ లైన్‌ను ఏర్పాటు చేశారు. ఫైబర్ నెట్‌తో తమ కేబుల్ వ్యవస్థ ఎక్కడ దెబ్బతింటుందోనని ఆపరేటర్లు ఆందోళన చెందారు. ఫైబర్ నెట్ కనెక్షన్లపై విముఖత చూపారు. అందుకే పట్టణాలు, సమీప గ్రామాలకే ఏపీ ఫైబర్ నెట్ పరిమితమైంది.

వైర్ల ద్వారా సరఫరాతో ఇబ్బందులు..

జిల్లాలో ఏపీ ఫైబర్ నెట్ టీమ్‌కు సంబంధించి 20 మంది వరకూ ఉన్నారు. వారికి సైతం జీతాలు సక్రమంగా చెల్లించడం లేదని తెలుస్తోంది. ఏపీ ఫైబర్ మంచిదే అయినా.. మిగతా ప్రైవేటు ఫైబర్లు టవర్ల ద్వారా సిగ్నల్‌ను పంపుతున్నాయి. కానీ ఏపీ ఫైబర్ మాత్రం వైర్ల ద్వారా అందుతోంది. అక్కడే సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. యూపీఎస్‌లతో పాటు ఇతర సామగ్రి కూడా అందించడం లేదని ఆపరేటర్లు వాపోతున్నారు. అందుకే వారు సైతం పెద్దగా సహకరించడం లేదు. దీంతో ఏపీ ఫైబర్ సేవలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. వాస్తవానికి ఏపీ ఫైబర్ నెట్ టారిఫ్ ధరలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయి. రూ.349కు సంబంధించి ప్రైవేటు సంస్థలతో పోల్చుకుంటే తక్కువే. కానీ 100 ఎంబీపీఎస్ నెట్ స్పీడు ఉంటేనే సేవలు సాధ్యమయ్యేది. కానీ ఏపీ ఫైబర్ నెట్‌కు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. నెట్‌వర్క్ సక్రమంగా ఉండడం లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గాడిన పెట్టే ప్రయత్నాలు చేస్తోంది. కానీ జిల్లాలో మాత్రం సేవలు మెరుగుపడడం లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు.

రెండు నెలల్లో గాడిన..

ఏపీ ఫైబర్‌నెట్‌ను గాడిలో పెట్టే ప్రయత్నంలో ప్రభుత్వం ఉంది. మరో రెండు నెలల్లో అన్ని సమస్యల పరిష్కారం దిశగా ప్రత్యేక ప్రణాళికతో అడుగులేస్తోంది. సాంకేతిక సమస్యలను అధిగమించడంతోపాటు తక్కువ ధరకు బేసిక్ ప్లాన్ అందుబాటులోకి తేనుంది. ప్రతి గ్రామానికి ఫైబర్ నెట్ సేవలు విస్తరించనున్నాం.

- గౌతమ్‌కుమార్, జిల్లా మేనేజర్, ఏపీ ఫైబర్ నెట్, శ్రీకాకుళం

నెట్‌వర్క్ సరిగ్గా లేదు..

ఇంటర్నెట్, కేబుల్, ల్యాండ్ ఫోన్ సౌకర్యం కలుగుతుందని చెప్పి ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్ తీసుకున్నాం. బేసిక్ ప్లాన్‌ను రూ.149 నుంచి రూ.350కు పెంచారు. ఆపై నిర్వహణ సరిగ్గా లేదు. నెట్‌వర్క్ సదుపాయం పూర్తిగా పడిపోయింది. దీంతో ఎప్పుడు సేవలు నిలిచిపోతాయో తెలియడం లేదు. అందుకే గతం మాదిరిగా విడివిడిగా మూడింటి ప్రొవైడర్ సేవలు తీసుకున్నాం.

- ఎం.రామారావు, రణస్థలం

నిర్వహణ అస్తవ్యస్తం..

జిల్లాలో ఏపీ ఫైబర్ నెట్ సేవల్లో ఎటువంటి పురోగతి లేదు. ముఖ్యంగా సిగ్నల్ సమస్యలు వేధిస్తున్నాయి. ఇతర ప్రైవేటు సంస్థల కంటే బేసిక్ ప్లాన్ అందుబాటులో ఉంది. కానీ ప్రైవేటు సంస్థలు ఇస్తున్న నాణ్యత ఇవ్వడం లేదు. నిర్వహణ సైతం బాగుండడం లేదు. ఇప్పటికైనా ఫైబర్‌నెట్‌ను గాడిలో పెట్టే ప్రయత్నం చేయాలి.

- ఐ.కోటేశ్వరరావు, జేఆర్ పురం

బండెక్కిన అభిమానం!

- ఇష్టారాజ్యంగా ద్విచక్ర వాహనాలకు నెంబరు ప్లేట్లు
- నిబంధనలను పట్టించుకోని వాహనచోదకులు







టెక్కలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఒక్కో ద్విచక్ర వాహన యజమానిది ఒక్కో స్టైల్. కొందరైతే సినీ స్టార్ల ఫొటోలు, ఇంకొందరు ఎమ్మెల్యే గారి తాలుకా, మరికొందరు ఇతర రాజకీయ పార్టీల నాయకుల అభిమానం వెరసి వారివారి ఫొటోలతో ద్విచక్రవాహనాల నెంబరు ప్లేట్లు కనిపిస్తునాయి. వాహన యజమానుల తలకెక్కిన అభిమానంతో నిబంధనలకు పాతరవేస్తున్నారు. వాస్తవానికి ద్విచక్రవాహనానికి తెలుపురంగు ప్లేట్లపై నలుపు అక్షరాలతో ముందు భాగంలో 28.5 ఇంటు 4.5సెంటీ మీటర్లు, వెనుక భాగంలో 20 ఇంటు 10 సెంటీమీటర్ల సైజులో నెంబరు ప్లేట్లు అమర్చాలి. ఏదైనా ద్విచక్రవాహనం కొనుగోలు చేసిన వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాగానే సంబంధిత నెంబరు ప్లేటు అమర్చే డీలరు హైసెక్యూర్టీ రిజిస్ట్రేషన్ నెంబరు ప్లేట్‌ను వాహనానికి అమరుస్తారు. అయితే కొంతమంది వాహనచోదకులు వాటిని తొలగించి తమకు నిచ్చిన సైజ్‌లో రకరకాల డిజైన్లతో నెంబరు ప్లేట్లను అమర్చుకుంటున్నారు. కొందరు యువకులు తమ వాహనాలకు ఉన్న నెంబర్లు సైతం కనిపించని విధంగా రాపించుకుంటున్నారు. తమ అభిమాన నాయకుడు, నటుల ఫొటోలతో ఇష్టానుసారంగా నెంబర్లు ప్లేట్లను మార్చేస్తూ నిబంధనలను పాటించడం లేదు. వాహన తనిఖీల్లో పట్టుబడినప్పుడు వారిని ప్రశ్నిస్తే.. మీ సంగతి చూస్తామంటూ బెదిరిస్తున్న ఘటనలు కూడా ఉన్నారు. ఈ తలనొప్పి మాకెందుకులే అని కొందరు అధికారులు చూసీచూడనట్లు వ్యవహ రిస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు అతిక్రమించే వాహనచో దకులపై తగిన చర్యలు తీసుకోకుంటే ఈ సంస్కృతి మరింత వ్యాప్తి చెందే అవకాశం లేకపోలేదు.

అవగాహన కల్పిస్తున్నాం..

ద్విచక్రవాహనలకు రిజిస్ట్రేషన్ సమయంలో డీలరు ఇచ్చిన హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబరు ప్లేటు విధిగా వాడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన కొందరిపై చట్ట ప్రకారం రూ.300 అపరాధ రుసుం విధిస్తున్నట్టు స్పష్టం చేశారు. ముఖ్యంగా యువతకు ఈ విషయంపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.

- రమణ, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, టెక్కలి

నారాయణవలసలో రూ.1.50 కోట్లు అవినీతి

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


సంతను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జూలై 13(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో నారాయణవలస పంచాయతీలో ఎలాంటి పనులు నిర్వహించకుండా సర్పంచ్ రూ.1.50 కోట్లు బుక్కేశారని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఆదివారం ఆయన నారాయణవలస సంతను పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు. గత ఐదేళ్లలో సంతలో ఎలాంటి అభివృద్ధి పనులు నిర్వహించకుండా రూ.1.50 కోట్లు ఖర్చు చేసినట్టు చూపించారని, దీనిపై విజలెన్సు ఎంక్వరీ వేస్తే ఎక్కడ పనులు చేసిన ఆనవాలు లేనట్టు తేలిందన్నారు. ఐదేళ్లలో ఆక్రమణదారులు సంతలో పక్కా షెడ్లు నిర్మించుకున్నారని, వారంతా వారం రోజుల్లో తొలగించాలని, లేకుంటే మీరే తొలగించాలని, అలాగే సంత మైదానం మొత్తం సర్వే నిర్వహించి ఎంత స్థలం ఉందో నివేదికలు ఇవ్వాలని టెక్కలి ఆర్డీవో ఎస్.కృష్ణమూర్తిని ఆదేశించారు. సంతకు వచ్చే పశువులు తాగేందుకు కనీసం తాగునీటిని కూడా లేకుండా చేశారన్నారు. గడిచిన ఐదేళ్లల్లో సంత నుంచి వచ్చిన ఆదాయం ఎంత అనేది నివేదిక ఇవ్వాలని ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్‌ను ఆదేశించారు. ఏడాదిలో సంతలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి గత వైభవం తీసుకువస్తానన్నారు. అలాగే నారాయణవలస గ్రామానికి నీటి సమస్య ఉందని, ఎన్ని బోర్లు వేసిన వేసవిలో ఇబ్బంది పడుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. రూ.600 కోట్లతో హిరమండలం రిజర్వాయర్ నుంచి పైపు లైన్ ద్వారా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానన్నారు. నిమ్మాడ జంక్షన్ నుంచి తిలారు మీదుగా నారాయణవలస వరకు రూ.200 కోట్లతో పక్కా సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, వాటి పనులకు మరో పది రోజుల్లో శంకుస్థాపన చేస్తానన్నారు. అనంతరం నారాయణవలస గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నేతలు బోయిన రమేష్, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరావు, పూజారి శైలజ, కర్రి అప్పారావు, తర్ర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరందిస్తాం


సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): వంశధార కాలువలు శివారు వ్యవసాయ భూములకు సాగునీరందించడమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పెద్దదుగాం వద్ద వంశధార ప్రధాన ఎడమకాలువపై గల నరసన్నపేట బ్రాంచి కాలువకు ఆదివారం సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 24 ఎన్‌బీసీ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కాలువ ద్వారా నరసన్నపేట, పోలాకి మండలాల పరిధిలోని 37,700 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. వంశధార ఈఈ మురళీమోహన్, డీఈలు శిమ్మ శ్రీనివాసరావు, రామలక్ష్మి, ఏఈలు హరీష్, శ్యామలరావు, పర్లాం, నరసన్నపేట, పోలాకి, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు కింజరాపు సత్యం, శిమ్మ చంద్రశేఖరరావు, ఎం.వెంకటప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

పోలాకి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజానికి ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక చింతనతో పాటు భక్తిభావం ఎంతో అవసరమని నగిరికటకం చిక్కోలు చాగంటి యిప్పిలి రామకృష్ణ శర్మ అన్నారు. ఆదివారం చింతాడపేట స్వామి రామయోగి సేవాశ్రమంలో నిర్వహించిన సత్సంగ సమావేశంలో ప్రవచకులుగా పాల్గొని ప్రసంగించారు. భగవద్గీతలో ఓ అధ్యాయమైన రోజూ చదవాలన్నారు. మూడునెలల పాటు మహావిష్ణువును ప్రార్థించాలన్నారు. కార్యక్రమంలో సేవాశ్రమ అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం, బొడ్డేపల్లి అప్పలనాయుడు, కరుకోల అనంతస్వామి, సింగుపురం లక్ష్మణరావు, యడ్లలక్ష్మణ తదితరులు పాల్గొన్నారు. భోజన వసతి సౌకర్యం కల్పించారు.

పదవిని కాపాడుకోవడం కోసమే తిలక్ ఆరాటం


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

టెక్కలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ తన పదవిని కాపాడుకోవడానికే కూటమి ప్రభుత్వ నేతలపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గడిచిన నాలుగు దశాబ్దాల్లో కింజరాపు కుటుంబం ఏనాడూ కుల రాజకీయాలు చేయలేదని, ఆ కుటుంబం ఎదుగుదల చూసి ఓర్వలేక మతిభ్రమించి వైసీపీ నాయకులు కుల ప్రస్తావన తెస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు టీడీపీ శ్రేణులను బయటకు రా కుండా కట్టడి చేసి కేసులు పెట్టి హింసించారని, అదే మంత్రి అచ్చెన్నాయుడు ప్రజాస్వామ్య విలువలు తెలిసిన వారు కనుక వైసీపీ శ్రేణులు సభలు, సమావేశాలు పెట్టుకోగలుగుతున్నారని, అది గుర్తెరగాలని హెచ్చరించారు. హనుమంతు రామకృష్ణ, ఇప్పిలి జగదీష్, మామిడి రాము, లవకుమార్, కోళ్ల కామేసు, మట్ట పురుషోత్తం, ప్రీతీష్‌చంద్ర, ప్రసాద్‌రెడ్డి, మల్లిపెద్ది మధు, సాహుకారి మోహనరావు, ధవళ రామచంద్రరావు, అభిలాష్, ప్రఫుల్లా తదితరులు ఉన్నారు.

బాలియాత్ర నిర్వహణ అనుమతి కోసం వినతి

జలుమూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రాచీన సంప్రదాయంగా వస్తున్న బాలియాత్ర 2025 శ్రీముఖలింగంలో పెద్ద ఎత్తున నిర్వహణకు కలెక్టరు అనుమతి కోసం వినతిపత్రం అందిస్తున్నట్టు కమిటీ ప్రతినిధి దువ్వాడ జీవితేశ్వరరావు తెలిపారు. బాలియాత్ర ఈ ఏడాది పెద్ద ఎత్తున నిర్వహణకు ఆదివారం 20 మందితో కమిటీ ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కమిటీ నేతృత్వంలో రాజకీయాల కతీతంగా బాలియాత్ర నిర్వహించి రాష్ట్ర పండగగా గుర్తించేలా కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. కటక్‌లో కార్తీక పౌర్ణమి పర్వదినం నుంచి వారం రోజులపాటు ఈ యాత్ర జరుగుతుందన్నారు. గత ఏడాది చేపట్టిన బాలియాత్ర విజయవంతమైనప్పటికీ, అంతకంటే ఘనంగా ఈ ఏడాది నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. జలుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు తర్ర బలరాం, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ హరిప్రసాదరావు, దేవ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా ఆర్థిక సాయం

కోటబొమ్మాళి, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా సీఎం సహాయనిధిని కూటమి ప్రభుత్వం అందిస్తుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో 13 మందికి మంజూరైన రూ.26,19,617 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. కోటబొమ్మాళి మండలం సాలిపేటకు చెందిన వి.రాజారావుకు రూ. 98,916, కోటబొమ్మాళికి చెందిన కె.లక్ష్మీనారాయణకు రూ.69,200, తిలారుకు చెందిన బి.హాసినికి రూ.48,734, చీపుర్లపాడుకు చెందిన కె.అర్జునరావుకు రూ.6,17,173, నందిగాం మండలం పెంటూరుకు చిందిన ఎస్.ధర్మారావుకు 12,8027, నౌగాంకు చెందిన బి.రామారావుకు రూ.25వేలు, లక్కివలసకు చెందిన ఎం.డిల్లమ్మకు రూ.47,388, జల్లపల్లికి చెందిన ఎస్.బాలరాజుకు రూ.6,09,301, సంతబొమ్మాళి మండలం మరువాడకు చెందిన రోహినికి రూ.2లక్షలు, గోవిందపురానికి చెందిన పి.చిన్నోడు రూ.5,42,716 తోపాటు మిగిలివారికి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అలాగే నందిగాం మండలం దిమ్మిడిజోల గ్రామానికి చెందిన 15 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంత్రి అందజేవారు. కొత్త అగ్రహారం పంచాయతీకి చెందిన సుమారు 100 మంది రైతులు 1బీ, అడంగళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్దాన ప్రాంతంలో పేరుకుపోతున్న చెత్త


బొడ్డపాడు-మాకన్నపల్లి మధ్యలో వేసిన చెత్తకుప్పలు

పలాసరూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉద్దాన ప్రాంత గ్రామాల్లో ఎక్కడికక్కడే చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. ఏ రోజుకారోజు చెత్తను తొలగించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్గంధ వాతావరణం నెలకొంది. ముఖ్యంగా పలాస మండలం బొడ్డపాడు, మాకన్నపల్లి తదితర గ్రామాల్లో చెత్తను ఎత్తేందుకు ప్రత్యేకమైన బండిని ఏర్పాటు చేసినా సరైన వేళల్లో వాటిని ఎత్తకపోతుండడంతో గ్రామంలోనే చెత్త ఉండి పోతుంది. మాకన్నపల్లి గ్రామంలో చెత్తను ఎత్తి మాకన్నపల్లి-బొడ్డపాడు గ్రామానికి మధ్యలో వేస్తుండడంతో రహదారి అంతా దుర్గంధ మవుతుంది. బొడ్డపాడు పంచాయతీలో చెత్తను ఎత్తి వేసేందుకు సరైన డంపింగ్‌యార్డు లేకపోవడం, ఉన్నా అది జాతీయ రహదారి వద్ద ఉండడంతో దూరవ్యయ ప్రయాసాలతో కూడుకో వడంతో చెత్తను ఎత్తే దిక్కులేక ఊరిలోనే నిల్వ ఉండిపోతుంది. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చెత్త కేంద్రాలను ఏర్పాటు చేసి తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా వేసేందుకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినా అది కేవలం నామమాత్రా నికే పరిమితమవుతుంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఎప్పటి చెత్త అప్పుడే ఎత్తి ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చేపట్టాల్సి ఉన్నా వీధుల్లోనే చెత్తను వదిలివేస్తుండడంతో రోగాలు వ్యాపించే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను సకాలంలో ఎత్తి బ్లీచింగ్ చేపట్టి ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అభివృద్ధి లేదు.. మరమ్మతులు చేయరూ!

- శివసాగర్ బీచ్‌లో పాడైపోయిన విశ్రాంతి షెడ్లు
- పర్యాటకులకు తప్పని అవస్థలు


శివసాగర్ తీరంలో పాడైపోయిన షెడ్లు

వజ్రపుకొత్తూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాట కేంద్రాల్లో ఒకటైన శివసాగర్ బీచ్‌కు వచ్చే పర్యాటకులు సేదతీరేందుకు విశ్రాంతి గదులు లేవు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న గౌతుశివాజీ రూ.90 లక్షలతో విశ్రాంతి షెడ్లు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అవికొంతమేరకు పూర్తయినా హుద్‌హుద్, తితలీ తుఫాన్ ధాటికి వాటిపై కప్పులు ధ్వంసం అయ్యాయి. తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో వీటి గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. ఐదేకరాల స్థలంలో శివసాగర్ తీరంలో అభివృద్ధి చేస్తున్నట్టు జిల్లా పర్యాటక అధికారులు హడావుడి చేసినా అవికార్యరూపం దాల్చలేదు. ఉన్న షెడ్లకు కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. ప్రతిరోజూ పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చే తీరాల్లో శివసాగర్ బీచ్ ఒకటి. రానున్న వర్షాకాలం, ఎండలను దృష్టిలో ఉంచుకొని పాడైపోయిన షెడ్లను రిపేరు చేసి పర్యాటకులు సేదతీరేందుకు అనుకూలంగా మార్చాలని స్థాని కులు కోరుతున్నారు.

'కోట' మృతి సినీ పరిశ్రమకు తీరనిలోటు

టెక్కలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): తెలుగు చలనచిత్ర పరిశ్రమలో విలక్షణ పాత్రలు పోషించిన కోట శ్రీనివాసరావు మృతి తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని సుదర్శన్ థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ అన్నారు. కోట శ్రీనివాసరావు విభిన్న పాత్రలతో ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. కామెడీ, విలనిజం పాత్రల్లో అద్భుత నటన చేశారని తెలిపారు. ఈయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. మేనేజర్ బాలకృష్ణ తదితరులు సంతాపం తెలిపారు.

బాధితులకు అండగా..

నరసన్నపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): అభాగ్యులకు అండగా సీఎం చంద్రబాబు నిలుస్తున్నారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీఎం సహాయనిధి నుంచి బాధితులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. చిక్కాలవలస గ్రామానికి చెందిన పొట్నూరు పద్మకు రూ.1.13 లక్షలు, సూరు నిర్మలకు రూ.1.78లక్షలు, నడగాం పంచాయతీ శివరాంపురం గ్రామానికి చెందిన పైల కృష్ణారావులకు సాయాన్ని అందజేశారు.

కార్మికులుగా ప్రభుత్వం గుర్తించాలి

పోలాకి, జూలై 13(ఆంధ్రజ్యోతి): వేటకు వెళ్లే మత్స్యకారులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి వైద్య సాయం అందించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నందుపల్లి దండాసి అన్నారు. ఆదివారం గుప్పెడుపేటకి చెందిన మత్స్యకారుడు ముంకు తాతయ్య వేటకు వెళ్లి ప్రమాద వశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాదనికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వరప్రసాద్, మెండ కేశవనాయుడు, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత కంటివైద్య శిబిరం

వజ్రపుకొత్తూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): చినవంకలో సోమవారం మైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు కె.రాకేష్ చెప్పారు. ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభం అవతుందని కంటిసమస్యలతో బాధ పడుతున్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కర్రలు తీసి స్తంభాలు వేశారు

హిరమండలం, జూలై 13(ఆంధ్రజ్యోతి): సుభలయ ఆర్ఆర్ కాలనీ పంచాయతీలోని 9వ వీధిలోని నెలకొన్న విద్యుత్ సమస్యలను సంబంధి అధికారులు పరిష్కరించారు. వీధిలోని లైన్‌కు సరిపడిన విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉండేవి. వీటికి కర్రలు పెట్టి పైకెత్తి ఉంచారు. ఈ విషయాన్ని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు విద్యుత్ శాఖధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఆదివారం విద్యుత్ అధికారులు స్పందించి ఆయా చోట్లకొత్తగా స్తంభాలు తెచ్చి వేయించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈనెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 18న ఒరిజినల్ సర్టిఫికేట్లతో శ్రీకాకుళం జూనియర్ కళాశాల (బాలురు)లో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంది.

పొందూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎలక్ట్రికల్ టెక్నీషియన్ లెక్చరర్ పోస్టుకు బీటెక్ (ఈఈఈ) పూర్తి చేసినవారు. కింతలి కళాశాలలో గణిత అధ్యాపకుడి పోస్టుకు ఆ సబ్జెక్ట్‌లో 50శాతంతో పీజీపూర్తి చేసినవారు అర్హులని ప్రిన్సిపాల్స్ ఇందిర, సునీత వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

- ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యా కోర్సుల్లో మెకానికల్, అకౌంట్స్ గ్రూప్‌ల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలున్నాయని ప్రిన్సిపాల్ బిశ్యాం సుందర్ తెలిపారు. మెకానికల్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత, ఐచ్ఛికంగా అకౌంటింగ్‌తో 50 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు.
- పాత శ్రీకాకుళం: బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ సబ్జెక్టులో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.సౌజన్య తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు.
- జలుమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ గెస్ట్ లెక్చరర్ పోస్టు అదే సబ్జెక్ట్‌లో 50 మార్కులతో పీజీ పూర్తి చేసినవారు అర్హులని ప్రిన్సిపాల్ జి.సారిక తెలిపారు.
- పోలాకి: ప్రియాగ్రహారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి.జగదీశ్వరరావు తెలిపారు.


ఓ ఇంటిముందు నిలిచిన మురుగునీరు

పట్టుపురంలో అపరిశుభ్రత

కోటబొమ్మాళి, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టుపురం గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. వీధులు, కాలువలు చెత్తా చెదారంతో నిండిపోయింది. ఇళ్ల ముంగిటే మురుగు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రివేళల్లో దోమల ఉధృతితో అవస్థలు పడుతున్నట్టు ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని విధుల్లో డ్రేనేజీలు లేకపోవడంతో వాడుక నీరు రోడ్డుపైనే నిలిచిపోతుందని గ్రామస్థులు అంటున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.